



2కె రన్‌లో పాల్గొన్న యువత


యువతకు స్ఫూర్తి వివేకానంద

డివైఎఫ్‌ఐ 2కె రన్‌లో రిటైర్డ్ ఏఎస్పీ రజాక్

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

స్వామి వివేకానంద జీవితం యువతకు స్ఫూర్తిదాయకం అని రిటైర్డ్ ఏఎస్పీ రజాక్ తెలిపారు. స్వామి వివేకానంద జయంతి సందర్భంగా భారత ప్రజాతంత్ర యువజన సమైక్య(డివైఎఫ్‌ఐ) ఆధ్వర్యంలో నగరంలోని కెఎస్ఆర్ జూనియర్ కళాశాల నుంచి రామ్‌నగర్ ఫ్లైఓవర్ వరకు 2కె రన్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా రిటైర్డ్ ఏఎస్పీ రజాక్, మాజీ ఎమ్మెల్సీ డా॥గేయనంద్, పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల నియోజకవర్గ పీడీఎఫ్ అభ్యర్థి పోతుల నాగరాజు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువత వివేకానంద జీవితాన్ని తెలుసుకోవాలన్నారు. ఆయన జీవితాన్ని తెలియజేస్తూ డివైఎఫ్‌ఐ ఆధ్వర్యంలో 2కె రన్ వంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయం అన్నారు. ఇక ప్రభుత్వం యువతకు ఉపయోగపడే కార్యక్రమాలను చేపట్టాలన్నారు. రాష్ట్రంలో పోలీస్ శాఖకు సంబంధించిన నోటిఫికేషన్ దాదాపు 5 సంవత్సరాలు పాటు లేకపోవడంతో నిరుద్యోగ యువకులు పెద్ద ఎత్తున నమోదు చేసుకున్నారని తెలిపారు. ఈ పరిస్థితుల్లో నియోజకవర్గానికి ఒక ఉచిత కోచింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలన్నారు. డీఎస్సీ, గ్రూపు-2 నోటిఫికేషన్లను విడుదల చేయాలని కోరారు. అనంతరం 2కె రన్‌లో గెలుపొందిన అభ్యర్థులకు నగదు ప్రోత్సాహ బహుమతులు అందించారు. మొదటి బహుమతి హరి ప్రసాద్, రెండో బహుమతి విశ్వనాథ్, మూడో బహుమతి అర్జున్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్‌ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బాలకష్ణ, నరసింహా, యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి లింగమయ్య, ఎస్ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి పరమేష్, డివైఎఫ్‌ఐ జిల్లా సహాయ కార్యదర్శులు చరణ్, శివ, ఎస్ఎఫ్‌ఐ జిల్లా సహాయ కార్యదర్శి గిరి తదితరులు పాల్గొన్నారు.

కౌలు రైతులకు ఏదీ గుర్తింపు..!



ప్రభుత్వం కౌలు రైతులకు అండగా ఉంటామని ప్రకటనలు చేస్తోంది. వారి కోసం సిసిఆర్‌సి కార్డు (కౌలు గుర్తింపు కార్డులు) ఇవ్వాలని నిర్ణయించింది. కౌలు కార్డులు ఇవ్వడం మొక్కుబడిగానే ఉంటోంది. అవి ఉన్నా కౌలు రైతుకు దక్కుతున్న ప్రయోజనం నామమాత్రంగానే ఉంటోంది. కనీసం పంటరుణాలు ఇచ్చిన దాఖలు కూడా నామమాత్రంగానే ఉన్నాయి. దీంతో కౌలు రైతులు ప్రభుత్వ సాయానికి దూరం అవుతున్నారు. అటు పంటలు అందక ఇటు ప్రభుత్వ సాయం అందక కౌలు రైతులు రెండు విధాలా నష్టాన్ని చవిచూస్తున్నారు.

- అందని పంట రుణాలు
- ప్రభుత్వం నుంచి సాయం కరువు
- కష్టాలను చవిచూస్తున్న కౌలు రైతులు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

అనంతపురం, సత్యసాయి రెండు జిల్లాల పరిధిలోనూ కౌలు రైతులు ఉన్నారు. అనంతపురం జిల్లాలో 2657 సిసిఆర్‌సి కార్డులు ఇచ్చారు. సత్యసాయి జిల్లా పరిధిలో కేవలం 523 మాత్రమే ఇచ్చారు. ఒక్క అనంతపురం జిల్లా పరిధిలోనే సుమారు లక్ష మంది వరకు కౌలు రైతులు ఉంటారన్నది రైతు సంఘాల అంచనా. నల్లరేగడి నేలలున్నా ఉరవకొండ, కణేకల్, బొమ్మనహాల్, విడపనకల్లు, వజ్రకరువూరు తదితర మండలాల్లో కౌలు రైతుల సంఖ్య గణనీయంగా ఉంది. ఈ ప్రాంతాల్లో కౌలు గుర్తింపు కార్డులు మంజూరు చూసినా నామమాత్రంగానే ఉంటోంది. ఇచ్చిన కౌలు గుర్తింపు కార్డుల్లోనూ అత్యధికంగా దేవాదాయ భూముల్లో సాగు చేసుకుంటున్న వారికే అధికంగా ఉంది. ప్రయివేటుగా రైతుల వద్ద కౌలుకు తీసుకుని పంటలు సాగు చేసుకునే రైతులకు మొక్కుబడిగానే కౌలు గుర్తింపు కార్డులిచ్చారు.

ప్రభుత్వం ద్వారా అందే ప్రయోజనం శూన్యమే...

ప్రభుత్వం కౌలు రైతులకు గుర్తింపు కార్డులు మంజూరు చేసింది కాని, దాని వలన కౌలు రైతుకు సబ్సిడీ విత్తనాలుగాని, పంటరుణంగాని అందుతున్న దాఖలాల్లేవు. పంటనష్టపోయిన సమయంలోనూ ఆ రైతులకు పరిహారం అందటం లేదు. అయితే ఈ గుర్తింపు కార్డు ఉండి రుణభారంతో చనిపోయిన రైతుకుటుంబాలకు మాత్రం పరిహారం అందుతోంది. కౌలు రైతు బతికుండగా అందిన సాయం శూన్యమనే చెప్పాలి. ఉరవకొండ మండలంలోని ముష్టూరులో గతేడాది జులై నెలలో రామాంజినేయులు అనే కౌలు రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈయనకు గుర్తింపు కార్డు ఉండటంతో ఆ కుటుంబానికి పరిహారం అందింది. అయితే ఆ రైతు పంట సాగు చేసుకునే సమయంలో మాత్రం ప్రభుత్వం పరంగా అందిన సాయం శూన్యమనే చెప్పాలి. ఇలా కౌలు రైతులు గుర్తింపునకు నోచుకున్నా పంట సాగుకు అవసరమైన సాయం ప్రభుత్వం వైపు నుంచి అందటం లేదన్న ఆరోపణలున్నాయి.

ప్రభుత్వం పూర్తి స్థాయిలో సహకారం అందివ్వాలి
బాలరంగయ్య, ఎపి కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి.

ప్రభుత్వం గుర్తింపు కార్డులు అందరికీ ఇవ్వటం లేదు. ఇచ్చిన వారికి కూడా అందుతున్న సాయం ఏమీ ఉండటం లేదు. పంటరుణాల్లేవు, సబ్సిడీ విత్తనాల్లేవు.. మొత్తం పెట్టుబడులు అంతా బయట అప్పుల చేసి తెచ్చి పెడుతున్నారు. పంటలు చేతికందకపోతే రుణభారం అధికమై ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. ప్రభుత్వం కౌలు రైతులను పూర్తి స్థాయిలో ఆదుకోవాలి.

వక్ఫ్‌బోర్డు ఆస్తుల పరిరక్షణే లక్ష్యం

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

జిల్లా వ్యాప్తంగా ఉన్న వక్ఫ్ బోర్డు ఆస్తులను పరిరక్షించడమే లక్ష్యంగా ముందుకెళ్తామని వక్ఫ్‌బోర్డు అనంతపురం జిల్లా ఛైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్ స్పష్టం చేశారు. గురువారం ఆర్‌బి అతిథిగహంలో నూతనంగా ఎంపికైన వక్ఫ్‌బోర్డు కమిటీ బాధ్యతల స్వీకరణ కార్యక్రమం జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి రఫీ, వక్ఫ్ బోర్డు ఇన్‌స్పెక్టర్ గౌస్, మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఈడీ మస్తాన్ సమక్షంలో జరిగింది. ఛైర్మన్‌గా కాగజ్‌ఘర్ రిజ్వాన్, వైస్ ఛైర్మన్‌గా అహ్మద్ బాషా, సెక్రటరీగా నూర్‌మహమ్మద్, జాయింట్ సెక్రటరీగా షేక్ ఖాజా, సభ్యులుగా ఖమర్తాజ్, షెక్షావలీ, మహమ్మద్ ఆసిఫ్, మహబూబ్‌పీరా, మీరాంబాషా, మహమ్మద్ ఫయాజ్‌లు బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ త్వరలో కమిటీ క్షేత్రస్థాయి పర్యటనలు చేస్తుందన్నారు. అనంతపురం జిల్లాలో సుమారు 5400 ఎకరాలకు పైగా వక్ఫ్‌బోర్డు భూములు ఉన్నాయని వక్ఫ్‌బోర్డు ఛైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్ తెలిపారు. అన్యాక్రాంతం అయిన వక్ఫ్ ఆస్తులను స్వాధీనం చేసుకుంటామన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మిని మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు.



రాయదుర్గంలో స్వామి వివేకానందకు నివాళులర్పిస్తున్న టిడిపి నాయకులు

వివేకానంద ఆశయాలను కొనసాగిద్దాం

అనంతపురం కలెక్టరేట్ : సమాజ చైతన్యం కోసం కృషి చేసిన స్వామి వివేకానంద ఆశయాలకు అనుగుణంగా ప్రతి ఒక్కరూ నడుచుకోవాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. గురువారం నాడు అనంతపురం విద్యుత్ సర్కిల్ రామకృష్ణ ధ్యాన మందిరంలో శ్రీ రామకృష్ణ సేవా సమితి, స్ఫూర్తి సేవా సంస్థ ఆధ్వర్యంలో స్వామి వివేకానంద 161 జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్ఫూర్తి సేవా సంస్థ సభ్యులు, పెన్షనర్స్ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి శీలా జయరామప్ప, భాస్కర్, చలపతి, యశ్వంత్ హాజరయ్యారు. ఈ సందర్భంగా స్వామి వివేకానంద చిత్రపటాల ఊరేగింపు వివేకానంద సూక్తులను పటిస్తూ టవర్ క్లాక్ నుంచి రఘువీర కాంప్లెక్స్ వరకు విద్యార్థి విద్యార్థినులతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు వివేకానంద బోధనలు, వారి జీవిత సందేశాలపై వక్తత్వ పోటీలు నిర్వహించారు. విజేతలకు సర్టిఫికెట్లు, బహుమతి ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో స్ఫూర్తి సేవా సంస్థ సభ్యులు జయపాల్‌రెడ్డి, రామకష్ణ, శివారెడ్డి పాల్గొన్నారు.

రాయదుర్గం : వివేకానంద యువజన దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం పట్టణంలోని టిడిపి కార్యాలయంలో స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వివేకానందుని ఆశయ సాధన కోసం యువకులు పాటుపడాలని, వివేకానందుని మార్గంలోని నడవాలని నాయకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు పసుపులేటి నాగరాజు, పట్టణ కార్యదర్శి ఇనాయత్‌బాషా, పోరాలు పురుషోత్తం, తెలుగు యువత తాలూకా అధ్యక్షుడు రమేష్, నాయకులు తిప్పేస్వామి, మారెప్ప, జిల్లా ఎస్సీ సెల్ మల్లికార్జున, సిద్ధప్ప, పైతోట రామాంజనేయులు, జమీల్‌ఖాన్, కిట్టు, సత్తి, తదితరులు పాల్గొన్నారు. కాగా స్వామి వివేకానంద జయంతి సందర్భంగా స్థానిక శారదాదేవి ట్రస్టు ఆధ్వర్యంలో 15 మంది విద్యార్థులకు రూ.1,60,000 ఉపకార వేతనాలు పంపిణీ చేశారు. బీటెక్, ఎంబిబిఎస్, బీఫార్మా మొదలైన ఉన్నత విద్య అభ్యసిస్తున్న 15 మందికి ట్రస్టు తరపున అందజేసినట్లు ట్రస్టు నిర్వాహకులు అర్చనానంద గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

రాయదుర్గం రూరల్ : కెటిఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ సేవా విభాగం ఆధ్వర్యంలో జాతీయ యువజన దినోత్సవాలన్ని ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు పాల్గొన్నారు.

సిసి రోడ్డు నిర్మాణానికి భూమిపూజ

రాయదుర్గం : పట్టణంలోని 5, 7వ ఎన్నికల వార్డులో సిమెంట్ రోడ్డు నిర్మాణానికి విప్ కాపు రామచంద్రారెడ్డి గురువారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా విప్ మాట్లాడుతూ టిడిపి ప్రభుత్వ పాలనలో పట్టణంలో అభివృద్ధి పనులు చేపట్టకుండా నిధులు స్వాహా చేశారని ఆరోపించారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా తాము ప్రజలను కలిసినప్పుడు ప్రజలు చేసిన విజ్ఞప్తి మేరకు రూ.26 లక్షలతో సిమెంటు రోడ్లు నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాయదుర్గం పురపాలక సంఘం అధ్యక్షులు పొరాలు శిల్ప, ఉపాధ్యక్షులు శ్రీనివాస్‌యాదవ్, వలిబాషా, కమిషనర్ దివాకర్‌రెడ్డి, వార్డు సభ్యులు శివకుమార్, మున్సిపల్ ఇంజినీర్ రామమూర్తి, కాంట్రాక్టర్లు కాంతారెడ్డి, సత్యనారాయణరెడ్డి, వైసిపి పట్టణ కన్వీనర్ ముస్తాక్, నాయకులు శివ, తదితరులు పాల్గొన్నారు.



సిసి రోడ్డుకు భూమిపూజ చేస్తున్న విప్ కాపు రామచంద్రారెడ్డి

ఇళ్ల నిర్మాణాలపై నిర్లక్ష్యం వీడండి

సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం

జిల్లా వ్యాప్తంగా జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలను మరింత వేగవంతం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ డిమాండ్ చేశారు. జగన్న ఇళ్లకు రూ.5 లక్షలు కేటాయించాలని, నిర్మాణ పనులను వేగవంతం చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం స్థానిక ఆర్డీవో కార్యాలయం వద్ద కార్యాలయం వద్ద సిపిఎం ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా రాంభూపాల్ మాట్లాడుతూ ప్రస్తుతం పెరిగిన గృహ నిత్యావసర వస్తువుల ముడిసరుకుల ధరలతో పోలిస్తే ప్రభుత్వం ఇస్తున్న రూ.1.80 లక్షలు ఏ మూలకూ సరిపోదన్నారు. ఈ మొత్తాన్ని రూ.5 లక్షలకు పెంచాలన్నారు. కళ్యాణదుర్గం రెవెన్యూ డివిజన్ పరిధిలో 8789 ఇళ్లు మంజూరు కాగా ఇప్పటిదాకా 1079 మాత్రమే నిర్మాణాలు పూర్తయ్యాయని చెప్పారు. కళ్యాణదుర్గం ప్రాతంలో 3533 ఇళ్లు మంజూరు కాగా ఇందులో కేవలం 379 ఇళ్ళు మాత్రమే పూర్తీఅయినట్లు అధికారులు చెబుతున్నారన్నారు. అంటే కనీసం పది శాతం నిర్మాణాలు కూడా పూర్తి కాలేదని చెప్పారు. వైసిపి అధికారంలోకి వచ్చి నాలుగేళ్లు గడుస్తున్నా ఇళ్ల నిర్మాణాల్లో అభివృద్ధి కన్పించకపోవడం విచారకరం అన్నారు. పట్టణానికి సుధూర ప్రాతంలో జగన్ కాలనీలు ఏర్పాటు చేయడం వల్ల అక్కడ మౌలిక వసతులు లేక లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. నిర్మాణాలకు సంబంధించి మౌలిక వసతులు కల్పించడంలో ఇటు ప్రభుత్వం, అటు అధికార యంత్రాంగం పూర్తిగా విఫలం అయ్యాయన్నారు. ఇక జగనన్న కాలనీలు, ఇతర ప్రాంతాల్లో అధికార పార్టీ నేతల భూ ఆక్రమణలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయని తెలిపారు. కబ్జాదారులు ప్రభుత్వ భూములను ఆక్రమించుకుంటున్నా పట్టించుకోని అధికారులు పేదలు జానడు స్థలంలో గుడిసెలు వేసుకుంటే మాత్రం వెంటనే వచ్చి వాటిని కూలదోస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో కళ్యాణదుర్గం ప్రాంతంలో పని చేసిన ఓ ఆర్డీవో ప్రభుత్వ భూములకు ఎన్‌ఓసీలు ఇచ్చారన్నారు. ఈ భూములను వైసిపి నాయకులు క్రయావిక్రయాలు కోట్లాది రూపాయలను కూడగట్టారన్నారు. వైసీపీ నాయకులు, అధికారులు కుమ్మక్కై ప్రకృతి వనరులు, ప్రజాప్రయోజనాల కోసం కేటాయించిన భూములను నొక్కేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అన్యాక్రాంతంకు గురైన ప్రభుత్వ భూములను వెంటనే స్వాధీనం చేసుకుని, పేదలకు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. జగనన్న ఇళ్ల స్థలాలు, ఇతర సమస్యలపై ఫిబ్రవరి 1వ తేదీ నుంచి కలెక్టరేట్ కార్యాలయం వద్ద వంట, వార్పు కార్యక్రమం నిర్వహిస్తామని హెచ్చరించారు. అనంతరం ఆర్డీవో కార్యాలయం ఏవోకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు అచ్యుత్ ప్రసాద్, మల్లికార్జున, సీనియర్ నాయకులు నాగరాజు, రంగనాథ, సిఐటియు నాయకులు ప్రభాకర్, రాము, అశోక్, రామచంద్ర, పరుశురాం, ఈశ్వర్, సిద్ధప్ప, ఎస్ఎఫ్‌ఐ నాయకులు విక్రం, వంశీ పాల్గొన్నారు.



ఆర్డీవో కార్యాలయ ఏవోకు వినతిపత్రం అందజేస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్

రవాణా వాహనాలపై త్రైమాసిక పన్ను పెంపు దుర్మార్గం

సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

రాష్ట్రంలో సరుకు, ప్రయాణికుల రవాణా వాహనాలపై మోపిన 30 శాతం త్రైమాసిక పన్నును తక్షణమే ఉపసంహరించుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాల వల్ల డీజల్ ధరలు పెరగడం, కరోనాతో కోలుకోలేని దెబ్బతినడం వలన రవాణా రంగం కుదేలయ్యిందన్నారు. కంతులు కట్టలేక, కిరాయిలు రాక, వాహనాలు 3 రెట్లు పెరిగాయని, గ్రీన్ ట్యాక్స్ పేరుతో గతేడాది పెంచిన పన్ను భారానికి వ్యతిరేకంగా యజమానులు ఆందోళన చేస్తూనే ఉన్నారని తెలిపారు. గ్రీన్ ట్యాక్స్‌ను తగ్గించకపోగా ఇప్పుడు త్రైమాసిక పన్నును 30 శాతం పెంచడం మూలిగే నక్కపై తాటిపండు పడ్డట్లే అన్నారు. దీని వల్ల పరోక్షంగా రూ.200 కోట్లు భారం ప్రజలు వినియోగదారులపై పడుతుందన్నారు. ట్రావెల్స్ బస్సులకు సీటుకు రూ.250 పెంచడమంటే ప్రయాణికులపై భారం వేయడమే అన్నారు. పక్కనున్న రాష్ట్రాలు కోవిడ్ సమయంలో త్రైమాసిక పన్నులకు రాయితీలిస్తే మన రాష్ట్రంలో పన్నులు పెంపుదల చేయడం గర్హనీయమని విమర్శించారు. రవాణా రంగంపై లక్షలాది మంది కార్మికులు ఆధారపడి జీవిస్తున్నారని తెలిపారు. ఈ రంగాన్ని కాపాడుకోవడం రాష్ట్ర శ్రేయస్సుకు అవసరం అన్నారు. త్రైమాసిక పన్నులు ప్రభుత్వం ఉప సంహరించుకోవాలన్నారు.

విజయసంకల్ప యాత్ర

ఉరవకొండ : మండల పరిధిలోని లత్తవరం తండా గ్రామంలో మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వర్‌రెడ్డి తనయుడు ప్రణయ్‌రెడ్డి ఆధ్వర్యంలో గురువారం విజయసంకల్ప యాత్ర కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా లత్తవరం తండా నుంచి లత్తవరం గ్రామం వరకు దాదాపు 1.5 కిలోమీటర్ల మేరకు 1.35 కోట్లతో ఏర్పాటు చేస్తున్న బీటీ రోడ్డుకు జడ్పీ ఛైర్మన్ బోయ గిరిజమ్మతో కలిసి భూమిపూజ చేశారు. అదేవిధంగా గ్రామంలో తాగినీటి సమస్య పరిష్కారం కోసం ఐదు లక్షల రూపాయలతో నిర్మించిన ఆర్‌ఒ ప్లాంట్‌ను రిబ్బన్ కట్‌చేసి ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సమావేశంలో యువనేత ప్రణయ్ రెడ్డి మాట్లాడుతూ ఉరవకొండ నియోజకవర్గంలో చేపట్టిన విజయసంకల్ప యాత్రలో ప్రజలు ఆదరిస్తున్న విధానాన్ని చూసి పయ్యావుల కేశవ్ సోదరులకు ఆ పార్టీ నాయకులకు భయం పట్టుకుందన్నారు. లతవరం తండా గ్రామానికి చెందిన కొంతమంది వైఎస్ఆర్సిపి ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ పథకాలు చూసి ఆకర్షితులై ప్రణయ్ రెడ్డి సమక్షంలో వైసిపి పార్టీలోకి చేరారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి ఆర్.అన్నపూర్ణ, ఎంపిటిసి చిట్టెమ్మ, వైసిపి నాయకులు నాగరాజు నాయక్, వెంకటేష్ నాయక్, ప్రసాద్ నాయక్, ఎర్రిస్వామి నాయక్, వెంకట నాయక్, లక్ష్మణ్ నాయక్, తులసీ నాయక్, ఉరవకొండ, విడపనకల్, వజ్రకరూర్ మండల వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చౌడేశ్వరీదేవి ఉత్సవాలు ప్రారంభం

రాయదుర్గం : పట్టణంలోని నేసేపేటలో వెలసిన చౌడేశ్వరీదేవి పంచమ జ్యోతుల మహోత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా ఉదయం అమ్మవారికి పంచామృత అభిషేకం, రుద్రాభిషేకం, వడిబియ్యం అనంతరం మహా మంగళహారతి నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని ఖడ్గాలతో స్తుతించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను అందించారు. సాయంత్రం గంగపూజ చేసి ఆలయానికి చేరుకున్నారు. శుక్రవారం ఉదయం తెల్లవారుజామున నాలుగు గంటలకు ఆలయ సమీపంలోని పాఠశాల నుంచి పంచమ జ్యోతులను పురవీధుల గుండా ఊరేగింపుగా వెళ్లి మధ్యాహ్నం ఆలయానికి చేరుకున్నారు. ఈ కార్యక్రమంలో విప్ కాపు రామచంద్రారెడ్డి, మున్సిపల్ ఛైర్‌పర్సన్ పొరాళు శిల్ప, పొరాలు శివ, శ్రీనివాసులు, ఆలయ కమిటీ ధర్మకర్త శ్రీరాములు, ఆలయ కమిటీ అధ్యక్షులు కృష్ణమూర్తి, కార్యదర్శి హనుమంతు, తొగటవీర క్షత్రియ సంఘం అధ్యక్షులు మద్దిలేటి ప్రభాకర్, కార్యదర్శి వెంకటరమణ, కోశాధికారి సత్యనారాయణ, లోకేష్, ఆలయ కమిటీ సభ్యులు, వందలాది మంది భక్తులు పాల్గొన్నారు.

మసీదుకు విరాళం

శింగనమల : మండల పరిధిలోని లోలూరు ఈద్గాకు ఎంపిటిసి కొరినేపల్లి మురార్జి విరాళం అందజేశారు. ఈద్గాకు చెందిన మత పెద్దలు విరాళం అందజేయాలని కోరగా స్పందించిన ఆయన గురువారం రూ.6వేల మొత్తాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎంపిటిసి మాట్లాడుతూ ఈద్గా అభివృద్ధికి తమవంతు సహకారం ఎప్పుడూ ఉంటుందన్నారు.



విరాళం అందజేస్తున్న ఎంపిటిసి మురార్జి

హెచ్చెల్సీ మట్టి తరలింపు

నిబంధనలకు నీళ్లు.. పట్టించుకోని అధికారులు

ఆందోళనలో రైతులు

ప్రజాశక్తి-బొమ్మనహాల్

మండలంలోని తుంగభద్ర ఎగువ కాలువకు గట్టున ఉన్న మట్టిని కొంతమంది అక్రమార్కులు యథేచ్ఛగా తరలిస్తున్నారు. మండల పరిధిలోని హెచ్చెల్సీ 135వ కిలోమీటర్ వద్ద ఏకంగా ఇటాచీ పెట్టి మరీ టిప్పర్లతో మట్టిని తోడుతున్నా అధికారులు పట్టించుకోకపోవడం పట్ల పలు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మండలంలోని రంగాపూర్ క్యాంపు నుంచి మైలాపురం, ఉప్పరాల క్రాస్, కృష్ణాపురం, రంగాపురం నుంచి గౌనూర్ వెళ్లే ప్రధాన రహదారులకు నూతన రోడ్లు వేస్తున్నారు. ఆయా రోడ్లకు అవసరమైన మట్టిని తుంగభద్ర ఎగువ కాలువ నుంచి తరలిస్తున్నారు.

సాధారణంగా ప్రభుత్వ నిబంధనల ప్రకారం మట్టిని తరలించకూడదు. అయితే 'అయినవారికి ఆకులో పెట్టిన' చందంగా అధికార పలుకుబడితో 12 అడుగుల ఎత్తు ఉన్న మట్టి దిబ్బను సుమారు కిలోమీటర్ పొడవున మట్టిని తరలించారు. ఇంకా తరలిస్తూనే ఉన్నారు. అయినా పట్టించుకునేవారే లేకుండా పోయారు.



హెచ్ఎల్సీ కాలువ గట్టుపై టిప్పర్‌లోకి మట్టి వేస్తున్న హిటాచీ

కాగా కెనాల్ తవ్వేటప్పుడు ముందస్తు అవసరాల కోసం అక్కడక్కడ పెద్దపెద్ద మట్టికుప్పలు పెడతారు. ఒకవేళ ఎక్కడైనా కెనాల్ గండి పడితే ఈ మట్టి కుప్పల నుంచి మట్టి తీసుకొచ్చి పూడుస్తారు. తద్వారా గండిని త్వరగా పూడ్చడంతోపాటు నీటి వృథాను అరికట్టవచ్చు. అయితే ఇలా మట్టిని తరలించడం వల్ల ప్రస్తుతం ఎక్కడైన గండి పడితే కిలోమీటర్లు వెళ్లి మట్టిని తెచ్చుకోవాల్సి వస్తోంది. తద్వారా సమయంతోపాటు నిధులు దుర్వినియోగం అవుతోందని స్థానికులు వాపోతున్నారు. ఇందులో భాగంగానే గతేడాది మండలంలోని నాగలాపురం 118వ కిలోమీటర్ వద్ద గండి పడితే దాదాపు 14 కిలోమీటర్ల దూరం నుంచి మట్టిని తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

ఈనేపథ్యంలో అక్రమంగా ఇటాచీ పెట్టి టిప్పర్లతో మట్టితోలుతున్నా పట్టించుకోకపోవడం పట్ల స్థానిక రైతులు విమర్శిస్తున్నారు. రైతుల ఇంటి అవసరాల కోసం ఎద్దుల బండితో మట్టి తోలుకుంటే కేసులు పెడుతున్న అధికారులు ఏకంగా ఇటాచీ పెట్టి తవ్వుతుంటే ఏం చేస్తున్నారని ప్రశ్నిస్తున్నారు. గతేడాది జూలై నెలలో ఓ రైతు తమ ఇంటి ముందుకు ఎద్దుల బండితో మట్టి తోలుకున్నాడు. దీంతో ఆగమేఘాల మీద ఇరిగేషన్ డిఇ జోక్యం చేసుకుని రైతుపై కేసు నమోదు చేశారు. అంతేగాకుండా రూ.5వేలు జరిమానా కూడా విధించారు. సామాన్య రైతుపై జులుం విధించిన అధికారులు ఇటాచి పెట్టి మరీ మట్టి తోలుతున్నా ఎందుకు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై కణేకల్ సెక్షన్ డిఇ గోపాల్‌నాయక్‌ను వివరణ కోరగా సమాచారం తెలుసుకుని చెబుతానని దాట వేయడం గమనార్హం. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి మట్టి తరలింపుపై చర్యలు తీసుకోవాలని స్థానిక రైతులు కోరుతున్నారు.

పాలన చేతకాకనే అక్రమ అరెస్టులు..!

పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి పోతుల నాగరాజు



పోతుల నాగరాజును అరెస్టు చేస్తున్న పోలీసులు

ప్రజాశక్తి-అనంతపురం

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు పాలన చేతకాకపోతే అక్రమ అరెస్టులు చేస్తారా అని పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి పోతుల నాగరాజు ప్రశ్నించారు. ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని అనంతపురం నగరంలోని మహాత్మా గాంధీ విగ్రహం వద్ద పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి పోతుల నాగరాజు దీక్ష చేయాలని తలపెట్టారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, కుల సంఘాలు, విద్యార్థి సంఘాల ప్రతినిధులు దీక్షకు మద్దతు తెలిపేందుకు సిద్ధమయ్యారు. అయితే గురువారం ఉదయం పోలీసులు వారందరిని ఇళ్లలోనే నిర్బంధించి అనంతరం పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా పోతుల నాగరాజు మాట్లాడుతూ.. సమస్యల పరిష్కారం కోసం ప్రజాస్వామ్య పద్ధతిలో దీక్ష చేయాలని చూస్తే అక్రమ అరెస్టు చేయడం సరికాదన్నారు. తాము ఉద్యమాలు చేయకుండా ఉండాలంటే సిఎం జగన్ ఇచ్చిన హామీలను అమలు చేయడం ఒక్కటే మార్గమని సూచించారు. సిఎం సలహాదారుల మాటలు విని దొడ్డిదారిన జీవో నెం 1 అమలులోకి తెచ్చారన్నారు. ఈవిషయంలోనే ప్రభుత్వ వైఫల్యం స్పష్టంగా కనిపిస్తోందన్నారు. పోలీసులను అడ్డుపెట్టుకుని నిర్బంధాలను అమలుచేస్తే 2024 ఎన్నికల్లో ప్రజలు బ్యాలెట్‌ను ఉపయోగించుకుని జగన్‌ను ఇంట్లో కూర్చోబెడతారని హితవుపలికారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఉన్న ముఖ్యమంత్రి రాజ్యాంగ నిబంధనలకు కట్టుబడి పాలన చేయాలని సూచించారు.

అక్రమ నిర్బంధాలను వ్యతిరేకిద్దాం
సిపిఎం నగర కార్యదర్శి వి.రామిరెడ్డి

ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులు, పెన్షనర్లు, నిరుద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరుతూ శాంతియుతంగా నిరసన తెలియజేస్తున్న పశ్చిమ రాయలసీమ పట్ట భద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పోతుల నాగరాజు, ఉద్యోగ, ఉపాధ్యాయ, విద్యార్థి, ప్రజా సంఘాల నేతలను హౌస్ అరెస్ట్ చేయడం దుర్మార్గంగా ఉందని సిపిఎం నగర 1వ కమిటీ కార్యదర్శి వి.రామిరెడ్డి తెలిపారు. గురువారం నాడు అక్రమ అరెస్టులను నిరసిస్తూ అనంతపురం రూరల్ పోలీస్ స్టేషన్ ఆవరణంలో నిరసన తెలిపారు. ఎమ్మెల్సీ అభ్యర్థి నాగరాజును సిపిఎం నాయకులు పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శాంతి దీక్ష చేయడానికి టవర్ క్లాక్ దగ్గర ఉన్న గాంధీ విగ్రహం దగ్గరకు బయలుదేరిన పోతుల నాగరాజును హౌస్ అరెస్ట్ చేయడం దుర్మార్గంగా ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ ఉద్యోగులు, ప్రతిపక్షాలు, ఇతర రాజకీయ పార్టీ నాయకులు, ప్రజా సంఘాలు, మేధావులపై దారుణంగా నిర్బంధాలకు పాల్పడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం విమర్శలను సహించలేకుండా ఉందన్నారు. దుర్మార్గంగా 1 జీవో తీసుకొచ్చి నిరసన తెలిపే హక్కు కూడా లేకుండా చేసిందని విమర్శించారు. తక్షణమే జీవో రద్దు చేయాలని కోరారు. సిపిఎం నగర నాయకులు వలీ, ప్రకాష్, మసూద్, బాబు, ఇస్మాయిల్, శివ, ఎన్టీఆర్ శీనా, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర నాయకులు సూర్యచంద్ర, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నరసింహ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



నాగరాజు అక్రమ అరెస్టును ఖండిస్తూ మద్దతు తెలుపుతున్న సిపిఎం, ప్రజాసంఘాల నాయకులు

ఎమ్మెల్సీ అభ్యర్థి నాగరాజు అక్రమ అరెస్టు సరికాదు :
వి.రాంభూపాల్

ఉద్యోగుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరికి నిరసనగా పిడిఎఫ్ బలపరుస్తున్న ఎమ్మెల్సీ అభ్యర్థి పోతుల నాగరాజు చేపట్టిన దీక్షను పోలీసులు అడ్డుకోవడాన్ని సిపిఎం జిల్లా కమిటీ తీవ్రంగా ఖండించింది. ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ మాట్లాడుతూ శాంతియుతంగా నిరసన తెలియజేయడానికి వెళుతున్న ఎమ్మెల్సీ అభ్యర్థి నాగరాజును గృహ నిర్బంధం చేయడం సరికాదన్నారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు, నిరుద్యోగులకు ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలు ఒకటి, అమలు చేస్తోంది మరొకటి అన్నారు. ప్రభుత్వ ఇలాంటి వైఖరి మానుకోవాలని లేని పక్షంలో మూల్యం చెల్లించుకోక తప్పదన్నారు.

ఉద్యోగం ఇప్పిస్తానని బురిడీ

గుంతకల్లు రూరల్ : పట్టణంలోని సంజీవ్‌నగర్ కాలనీలో నివాసముంటున్న ఓ యువతికి ప్రభుత్వ ఉద్యోగం ఇప్పిస్తానంటూ స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో అటెండర్‌గా విధులు నిర్వహిస్తున్న ఓ వ్యక్తి రూ.2 లక్షలు కాజేసిన సంఘటన వెలుగు చూసింది. బాధితురాలు తహశీల్దారు రాముకు గురువారం ఫిర్యాదు చేసింది. వివరాల్లోకి వెళ్తే.. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో అటెండర్‌గా విధులు నిర్వహిస్తున్న తిప్పేస్వామి ఆర్డీవో కార్యాలయంలో అటెండర్ ఉద్యోగం ఇప్పిస్తానంటూ నమ్మబలికి సదరు యువతి నుంచి రూ.2 లక్షలు నగదు తీసుకున్నాడు. డబ్బులు తీసుకుని రోజులు గడుస్తున్నా ఉద్యోగం ఊసు ఎత్తకపోవడంతో ఆ యువతికి అతడిపై అనుమానం వేసింది. తనకు ఏ ఉద్యోగం వద్దని..తాను ఇచ్చిన నగదు తిరిగి ఇవ్వాలని తిప్పేస్వామిని అడిగింది. డబ్బు కాజేసిన ఉద్యోగి ప్రస్తుతం తన వద్ద అంత నగదు లేదని, మూడు నెలలు గడువు ఇస్తే డబ్బు తిరిగి ఇస్తానని చెప్పాడు. అందుకు ఆయువతి ససేమిరా అనడంతో.. నీకు ఇష్టం వచ్చినట్లు చేసుకోమని బాధితురాలిని బెదిరించాడు. ఆ యువతి చేసేదేమీ లేక అటెండర్‌తో ఫోన్‌లో సంభాషించిన వాయిస్ రికార్డులను తహశీల్దారుకు చూపించి తనకు న్యాయం చేయాలని కోరింది. తహశీల్దార్ రాము ఆ ఉద్యోగిని పిలిపించి విచారించాడు. తనకు ఏ పాపం తెలియదని, ఆ యువతి తనకు డబ్బు ఇవ్వలేదని తెలిపాడు. ఇద్దరి రికార్డు వాయిస్‌ను నమోదు చేసి పై అధికారులకు పంపనున్నట్లు తహశీల్దారు పేర్కొన్నారు.

ఘనంగా సంక్రాంతి వేడుకలు

ఉరవకొండ : ఉరవకొండ పట్టణంలోని విశ్రాంత ఉద్యోగుల భవనం ఆవరణలో జై కిసాన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం సంక్రాంతి వేడుకలు నిర్వహించారు. పల్లెల్లో అంతరించిపోతున్న సంబరాలను వీరు చేసి చూపించారు. అందమైన రంగవల్లులు ,భోగిమంటలు, ఆవుపేడతో గొబ్బెమ్మలు, కొత్తమట్టి కుండలో పాలు పొంగించి చక్కర పొంగలి చేయడం, బొమ్మల కొలువు, చిన్న పిల్లలకు బోగిపళ్లు పోయడం అందరూ కలిసి ఒక్కొక్కరు ఒక వెరైటీ పిండివంటలు తయారుచేసుకొని వచ్చి పండుగ భోజనం చేసారు. మహిళలు కోలాటం, భోగిమంటలు చుట్టూ నృత్యాలతో ఆనందపరవశమయ్యారు. చిన్నారులు హరిదాసు వేషధారణలతో ఆకట్టుకున్నారు. పురుషులు గుమ్మడికాయ పగలకొట్టారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంపీపీ చంద్రమ్మ, సర్పంచి లలితమ్మ, నిస్వార్థ సేవా సంస్థ వ్యవస్థాపకులు వెంకట్ గురూజీ, శ్రీవాణి, జై కిసాన్ సంస్థ వ్యవస్థాపకులు నాగమల్లి ఓబులేసు గురూజీ, రజని దంపతులు, నిత్య యోగా శిక్షకులు చంద్ర శేఖర్ గురూజీ భార్య వరలక్ష్మి దంపతులు హాజరయ్యారు.

ప్రజాశక్తి క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న మేయర్ వసీం తదితరులు

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

ప్రజాశక్తి దినపత్రిక 2023 నూతన క్యాలెండర్‌ను అనంతపురం నగరపాలక సంస్థ మేయర్ మొహమ్మద్ వసీం తన చాంబర్‌లో కార్పొరేటర్లు, వైసీపీ నాయకులతో కలిసి గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ..ప్రజల పత్రికగా పేరొందిన ప్రజాశక్తి మరింత అభివృద్ధి చెందాలని, అందుకు ప్రజలు తోడ్పాటు నందిస్తారని ఆకాంక్షించారు. ప్రజాశక్తి అభివృద్ధికి కృషిచేస్తున్న సంస్థ సిబ్బంది, పాత్రికేయులను అభినందించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు ఇస్హాక్, నరసింహులు వైసిపి నాయకులు కొర్రెడ్డి ప్రకాష్‌రెడ్డి, మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు : ఆత్మకూరు పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ రంగడు యాదవ్ చేతుల మీదుగా ప్రజాశక్తి క్యాలెండర్‌ను గురువారం ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రజాశక్తి దినపత్రిక శక్తివంచన లేకుండా కృషి చేస్తోందని పేర్కొన్నారు.

ఉరవకొండ : ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రజాశక్తి పత్రిక శక్తి వంచన లేకుండా కృషి చేస్తుందని విడపనకల్ ఎంపిపి కరణం పుష్పావతి భీమ్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం విడపనకల్లు ఎంపీడీవో కార్యాలయం ప్రాంగణంలో ప్రజాశక్తి క్యాలెండర్లను ఎంపీపీ కణం పుష్పావతి, పిఎసిఎస్ ఛైర్మన్ శ్రీరాములు, వైసిపి రాష్ట్ర నాయకులు భరత్‌రెడ్డి, కరణం భీమిరెడ్డి, వ్యవసాయ అధికారి పిన్నయ్య, ఎఇఒ రాఘవేంద్ర చేతుల మీదుగా ఆవిష్కరించారు. అనంతరం ప్రజాశక్తి విలేకరి ఎంఎస్.వెంకటేషులును సన్మానించారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు లెజెండ్ మోదపల్లి రామాంజనేయులు, జయసింహ, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ రమేష్, పంచాయతీ సెక్రెటరీ మహబూబ్ బాషా, విద్యా కమిటీ ఛైర్మన్ గిరిబాబు, వైసిపి జిల్లా స్టీరింగ్ కమిటీ సభ్యులు సుంకన్న, వైసిపి నాయకులు దేశాయి సిద్ధార్థ, పాల్తూరు నాగరాజు, బెస్త ఎర్రిస్వామి, ఎంఆర్‌పిఎస్ జిల్లా కార్యదర్శి కెంగూరి ఎర్రి స్వామి, మండల నాయకులు పాల్గొన్నారు.



నివాళి అర్పిస్తున్న మేయర్ వసీం, కార్పొరేటర్లు

ఘనంగా వివేకానంద జయంతి

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

భారతదేశ ఖ్యాతిని ప్రపంచదేశాలకు చాటిచెప్పిన ఘనత వివేకానందుడిదని నగర మేయర్ మొహమ్మద్ వసీం పేర్కొన్నారు. గురువారం స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని నగరపాలక సంస్థ కార్యాలయంలోని మేయర్ ఛాంబర్‌లో వివేకానందుని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మేయర్ మహమ్మద్ వసీం, డిప్యూటీ మేయర్ వాసంతి, విజయభాస్కర్‌రెడ్డి, అదనపు కమిషనర్ రమణారెడ్డి, డిప్యూటీ కమిషనర్ సావిత్రి, కార్పొరేటర్లు కమల్‌భూషణ్, అనిల్‌కుమార్‌రెడ్డి, బాలాంజినేయులు, మునిశేఖర్, సైఫుల్లా బేగ్, నరసింహులు, బాబా ఫక్రుద్దీన్, చంద్రమోహన్‌రెడ్డి, దుర్గాదేవి, శ్రీనివాసులు, కార్యదర్శి సంగం శ్రీనివాస్, డీఈ నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

అనంతపురం : జాతీయ యువజన దినోత్సవాన్ని అనంతలక్ష్మి ఇంజినీరింగ్ కళాశాలలో ఘనంగా నిర్వహించారు. కళాశాల ఛైర్మన్ అనంతరాముడు వివేకానందుని చిత్రపటానికి పూలమాల వేసి నివాళిఅర్పించారు. విద్యార్థినులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఉమెన్ సెల్ కోఆర్డినేటర్ మాధవి, ప్రిన్సిపల్ మూర్తిరావు ఖోకలే, నైపుణ్యాభివృద్ధి సంచాలకులు సురేంద్ర నాయుడు, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్, ఖలీల్‌బాషా, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గుత్తి : గుట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం స్వామి వివేకానంద జయంతిని ఘనంగా నిర్వహించారు. స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాలేసి నివాళులర్పించారు. ముఖ్యఅతిథి డాక్టర్ బ్రహ్మానందరెడ్డి మాట్లాడుతూ యువత స్వామి వివేకానంద స్ఫూర్తితో ముందుకెళ్లాలని అన్నారు. కార్యక్రమంలో గేట్స్ ఇంజనీరింగ్ కళాశాల కరస్పాండెంట్ వీకే.పద్మావతమ్మ, మేనేజింగ్ డైరెక్టర్ గజ్జల రఘునాథ్ రెడ్డి, ప్రిన్సిపల్ అరవింద్, వైస్ ప్రిన్సిపల్ సిద్ధేశ్వరరావు, ఎన్ఎస్ఎస్ విభాగ అధిపతి రితీష్, అధ్యాపకులు పాల్గొన్నారు.

పుట్లూరు : స్వామి వివేకానంద జయంతిని పుట్లూరు మండల కేంద్రంలో గురువారం ఘనంగా నిర్వహించారు. వివేకానందుని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో బిజెపి మండల అధ్యక్షుడు కుందు శ్రీనివాసులరెడ్డి, ఓబీసీ మోర్చా మండల అధ్యక్షుడు రాగేని రామంజి యాదవ్, కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి కె చంద్రశేఖర్ రెడ్డి, ఎస్సీ మోర్చా మండల అధ్యక్షుడు రామ్మోహన్, మండల ఇన్‌ఛార్జి వెంకటయ్య, ఉపాధ్యక్షులు తిరునగరి ఆంజనేయస్వామి తదితరులు పాల్గొన్నారు.

విహారయాత్రలో విషాదం

పెన్నఅహోబిలం హెచ్ఎల్‌సి ప్రవాహంలో పడి విద్యార్థిని మృతి

ప్రజాశక్తి-ఉరవకొండ



మహిత (ఫైల్ ఫొటో)

ఉరవకొండ మండలం పెన్నహోబిలం పుణ్యక్షేత్రం వద్ద విహారయాత్రలో గురువారం విషాదం చోటుచేసుకుంది. బుక్కరాయసముద్రం మండలం నీలంపల్లి గ్రామానికి చెందిన హిమబిందు తన ఇద్దరు కుమార్తెలతో కలిసి సంక్రాంతి సెలవుల్లో పుణ్యక్షేత్రానికి విహారయాత్రకు వచ్చారు. దైవ దర్శనం అనంతరం ఆలయ పరిసరాల్లో ఉన్న హెచ్ఎల్‌సి కాలువ జలపాతాల వద్ద ప్రకృతి సోయగాల మధ్య ఆనందంగా గడపడానికి వెళ్లారు. మహిత (14) ప్రమాదవశాత్తు కాలుజారి హెచ్ఎల్‌సి కాలువ ప్రవాహంలో పడి కొట్టుకుపోయింది. ఇది గమనించిన స్థానికులు, కుటుంబ సభ్యులు మహితను ప్రవాహం నుండి బయటకు తీశారు. అప్పటికే మహిత మృతి చెందింది. కుటుంబ సభ్యులు బోరున విలపించారు. ఈ ప్రవాహంలో గత ఏడాది కూడా గుంతకల్లుకు చెందిన ఇద్దరు మృతి చెందిరు. తరచూ ఇక్కడికి వచ్చే యాత్రికులు ఈ ప్రాంతంలో ప్రమాదాలకు గురవుతున్నా సంబంధిత అధికారులు జాగ్రత్తలు తీసుకోకపోవడం గమనార్హం.

ఆలయానికి రూ.50 వేలు విరాళం

నార్పల : నడిమిదొడ్డి గ్రామంలోని శ్రీ సీతారాముల స్వామి ఆలయానికి టిడిపి రాష్ట్ర కార్యదర్శి ఆలం నరసానాయుడు రూ.50 వేలు విరాళాన్ని అందజేశారు. బుధవారం గ్రామ పెద్దల సమక్షంలో డబ్బును అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచి నారాయణస్వామి, సర్పంచి నాగర్జున, చంద్రమోహన్‌రెడ్డి, గ్రామ కమిటీ అధ్యక్షుడు నల్లప్ప, నాగర్జునరెడ్డి, గంగయ్య, రామాంజినేయులు, జగదీశ్, హరి తదితరులు పాల్గొన్నారు.

తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా

ప్రజాశక్తి-యల్లనూరు

సాగు భూమి లేని ప్రతి పేద కుటుంబానికీ ఎనిమిదో విడత భూపంపిణీలో ఐదు ఎకరాలు ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.కృష్ణమూర్తి, అధ్యక్షులు ఎస్.సూరి డిమాండ్ చేశారు. పేదలకు భూమి ఇవ్వాలని స్థానిక ఎమ్మార్వో కార్యాలయం ఎదుట గురువారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ..యల్లనూరు మండల కేంద్రంలో సాగు భూములు లేని పేదలు ఎంతో మంది ఉన్నారన్నారు. వారందరూ రైతుల భూముల్లో వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారన్నారు. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నవరత్నాల పేరుతో పేదలను ఆదుకుంటామని హామీలు ఇచ్చి కాలయాపన చేస్తోందే తప్ప పేదలకు భూ పంపిణీ చేసిన పరిస్థితి లేదన్నారు. ఇప్పటికైనా సాగు భూమిలేని పేదలను గుర్తించి ప్రతి కుటుంబానికి ఐదు ఎకరాలు సాగు భూమి ఇవ్వాలని, పేదలకు ఇంటి స్థలంతో పాటు ఇళ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. జగనన్న ఇంటికి రూ.5 లక్షలు పెంచాలని, వ్యవసాయ కూలీలకు కూలి రేట్లు పెంచి, వివరాలతో కూడిన బోర్డును గ్రామ సచివాలయంలో ఏర్పాటు చేయాలని, రేషన్ డీలర్ల ద్వారా 14 రకాల సరుకులు ఉచితంగా పంపిణీ చేయాలని కోరారు. అనంతరం తహశీల్దారుకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు సూరి, ఓబులేసు, నాయకులు మునేంద్ర, లక్ష్మీనారాయణ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు పెద్దయ్య, రామాంజనేయులు, రమేష్ వెంకట చౌదరి, కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి బోరు పరిశీలన

పుట్లూరు : తక్కలపల్లి గ్రామ సచివాలయం వద్ద తాగునీటి కోసం వేస్తున్న బోరును ఎంపీడీవో యోగానందరెడ్డి గురువారం పరిశీలించారు. అనంతరం గ్రామంలో వేసిన సిసి రోడ్డును పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి మహేశ్వర్‌రెడ్డి, ఏపీవో చెన్నకేశవులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



నిత్యావసర సరుకులు అందజేస్తున్న దృశ్యం

నిత్యావసర వస్తువులు పంపిణీ

అనంతపురం : సంక్రాంతి పండుగ సందర్భంగా నిత్యసురభి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పేద ప్రజలకు నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. ఆదర్శనగర్ లోని నిత్యసురభి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్మించిన "పుట్టినిల్లు" ఆశ్రమంలో గురువారం పంతుల కాలనీ, చంద్రబాబు నగర్‌కు చెందిన 25 పేద కుటుంబాలకు 24 రకాల వస్తువులు అందజేశారు. రూ.25 వేల ఖర్చుతో డిఎస్‌పి మల్లికార్జున వర్మ, పుట్టినిల్లు ఆశ్రమం వ్యవస్థాపకులు పురుషోత్తమ మురళీకృష్ణ చేతుల మీదుగా నిత్యావసర సరుకులను అందించారు.

నేరాలు ఘోరాలు

పేకాట జూదరులు అరెస్టు

ప్రజాశక్తి-బెలుగుప్ప

శిర్పి గ్రామ శివారులోని చింత తోపులో పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందడంతో బెలుగుప్ప ఎస్ఐ రామకృష్ణయ్య ఆధ్వర్యంలో పోలీసులు గురువారం సాయంత్రం దాడులు నిర్వహించారు. 16 మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.12,400 నగదు, 8 ద్విచక్ర వాహనాలు, సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి కోర్టుకు హాజరుపరచనున్నట్లు పోలీసులు తెలిపారు.

కంటైనర్ ఢీకొని దంపతులకు గాయాలు

ప్రజాశక్తి-గుత్తి

మండలంలోని బాచుపల్లి గ్రామ సమీపంలో ఉన్న బాట సుంకలమ్మ ఆలయం వద్ద 44వ జాతీయ రహదారిపై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో దంపతులకు గాయాలయ్యాయి. కె.ఉబిచెర్లకు చెందిన అంజనమ్మ, రాముడు దంపతులు ద్విచక్ర వాహనంలో వెళ్తుండగా కంటైనర్ ఢీకొంది. గాయపడ్డ వారిని చికిత్స నిమిత్తం గుత్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

302 క్వింటాళ్ల స్టోర్ బియ్యం పట్టివేత

ప్రజాశక్తి-గుత్తి

మండలంలోని బసినేపల్లి తండా గ్రామ మలుపు వద్ద అక్రమంగా తరలిస్తున్న స్టోర్ బియ్యాన్ని సాయంత్రం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు గురువారం పట్టుకున్నారు. 302 క్వింటాళ్ల స్టోర్ బియ్యాన్ని వాహనాల్లో కర్ణాటకకు తరలిస్తుండగా విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీఎస్పీ జి.వీర రాఘవరెడ్డి, సిఐ వి.వెంకటరమణ లు దాడిచేసి పట్టుకున్నారు. వాహనాల డ్రైవర్లను అరెస్టు చేసి, స్టోర్ బియ్యాన్ని స్వాధీనం చేసుకుని సీజ్ చేసినట్లు అధికారులు తెలిపారు. దాడుల్లో డిసిటిఒ విజయలక్ష్మి, సిఎస్‌డిటి కంబక్క, సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి హామీ సామాజిక తనిఖీ ప్రజావేదిక

ప్రజాశక్తి-తాడిపత్రి రూరల్

మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో 2020-21, 21-22 ఆర్థిక సంవత్సరాల్లో ఉపాధి హామీ పథకం ద్వారా నిర్వహించిన పనులపై సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమం ఎంపిపి సరస్వతి అధ్యక్షత జరిగింది. ఈ సందర్భంగా డిఆర్‌పిలు పంచాయతీ వారీగా నివేదికలు చదివి వినిపించారు. జిల్లా విజిలెన్స్ అధికారి రమణారెడ్డి టెక్నికల్ అసిస్టెంట్లతో మాట్లాడుతూ అవెన్యూ ప్లాంటేషన్‌కు సంబంధించిన మూడు దశల ఫొటోలను ఫీల్డ్ అసిస్టెంట్ తొలగిపోతే వాటి యొక్క వాచ్ అండ్ వార్డ్ స్థితిగతులను పక్కాగా రికార్డులో పొందుపరచాలన్నారు. లేకపోతే రికవరీలను టిఎలు కట్టాల్సి వస్తుందని సూచించారు. ఎర్రగుంటపల్లి పంచాయతీలో ఉపాధి పనులు చేయని వారికి మస్టర్ వేసినట్లు, ఇద్దరు వ్యక్తులకు డబుల్ జాబ్ కార్డులు ఉన్నట్లుగా గుర్తించి వాటిని వెంటనే తొలగించేలా చూడాలని తెలిపారు. కొన్ని పంచాయతీల్లో జరిగిన అవకతవకలపై విచారణ జరపాలని ఏపీడీ వెంకటరత్నంను డివిఒ రమణారెడ్డి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పిఒ సుధాకర్‌రెడ్డి, విజిలెన్స్ అధికారి రమణారెడ్డి, ఎంపీపీ సరస్వతి, ఎపిఒ గంగరాజు, పిఆర్ ఇంజినీరింగ్ సిబ్బంది, ఉపాధి కార్యాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కోడి పందేలు నిర్వహిస్తే చర్యలు

ప్రజాశక్తి-ఆత్మకూరు

సంక్రాంతి పండుగ సందర్భంగా గ్రామాల్లో కోడి పందేలను నిషేధించామని, నిబంధనలు ఎవరైనా ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ రంగడు యాదవ్ హెచ్చరించారు. గ్రామాల్లో ఎవరైనా కోడి పందేలు నిర్వహించినా, పేకాట ఆడినా డయల్ 100 లేదా 9440901858 నెంబర్‌కు ఫోన్ చేసి పోలీసులకు తెలియజేయాలని ప్రజలను కోరారు.

ఆధార్ సెంటర్ ప్రారంభం

పుట్లూరు : మండలంలోని తక్కళ్లపల్లిలో ఆధార్ సెంటర్‌ను ప్రారంభించినట్లు ఎంపీడీవో యోగానందరెడ్డి తెలిపారు. ప్రస్తుతం పుట్లూరు సచివాలయంలో మాత్రమే ఆధార్ సర్వీసులను ఇస్తున్నామని చెప్పారు. ప్రస్తుతం పుట్లూరుతో పాటు మడ్డిపల్లి, కడవకల్లు, తక్కళ్ళపల్లి గ్రామాల్లో కొత్తగా ఆధార్ సేవలు ప్రారంభించామని తెలిపారు. మండల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచి మహేశ్వర్ రెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు

పెద్దపప్పూరు : చిన్నపప్పూరు గ్రామ సమీపంలో వెలసిన పవిత్ర పుణ్యక్షేత్రమైన శ్రీ అశ్వర్థ నారాయణస్వామి, భవాని భీమలింగేశ్వర స్వామి వార్ల బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ ఛైర్మన్ శ్రీనివాసరెడ్డి తెలిపారు. చలువ పందిళ్లు, తోపులాట జరగకుండా క్యూలైన్లు ఏర్పాటు చేశామన్నారు. ఎస్ఐ ఖాజాహుస్సేన్ బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను తన సిబ్బందితో వెళ్లి గురువారం పరిశీలించారు.

సెలవుల్లో పాఠశాలలు నిర్వహిస్తే చర్యలు

ప్రజాశక్తి,-నార్పల

సంక్రాంతి పండగ సందర్భంగా ఈ నెల 12 నుంచి 18వ తేదీ వరకు ప్రభుత్వం పాఠశాలలకు సెలవులు ప్రకటించిందని, ప్రభుత్వ ఆదేశాలను ధిక్కరించి ప్రయివేటు పాఠశాల యాజమాన్యం తరగతులు, స్టడీ అవర్స్ నిర్వహిస్తే చర్యలు చేపడతామని ఎంఇఒ కృష్ణయ్య హెచ్చరించారు. చదువుల పేరుతో విద్యార్థుల వ్యక్తిగత స్వేచ్ఛను హరిస్తామంటే సహించమన్నారు.

కిశోర బాలికలు పౌష్టికాహారం తీసుకోవాలి

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

కిశోర బాలికలు పౌష్టికాహారం తీసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి వీరబ్బాయి దొర తెలిపారు. గురువారం బుక్కరాయసముద్రం మండల కేంద్రంలోని సచివాలయం-1 నందు పాఠశాలలకు వెళ్లని కిశోర బాలికలకు రక్తహీనత పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి వీరబ్బాయి దొర ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి మాట్లాడుతూ.. 10 నుండి 19 ఏళ్ల కిశోర బాలికలు రక్తహీనత పరీక్ష తప్పనిసరిగా చేయించుకోవాలన్నారు. రక్తహీనత కలిగిన బాలికలు ఎఎన్ఎంల ద్వారా ఐరన్ ఫోలిక్ ఆసిడ్ మాత్రలు తీసుకొని రోజుకు ఒకటి చొప్పున వాడాలని సూచించారు. వేరుశనగ, బెల్లం, నువ్వులు, డ్రై ఫ్రూట్స్, బచ్చలి ఆకు, గోంగూర వంటి పచ్చని ఆకుకూరలు, కూరగాయలు, దానిమ్మ పండ్లు విరివిగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి యుగంధర్, జిల్లా నోడల్ అధికారి నారాయణస్వామి, సర్పంచి పార్వతి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి స్వాతిలక్ష్మి, సిహెచ్ఒ మోహనరావు, సూపర్‌వైజర్ ఈశ్వరమ్మ, ఎఎన్ఎం ఆదినారాయణమ్మ, ఆశాలు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు పౌష్టికాహారం అందజేస్తున్న వైద్య ఆరోగ్య శాఖ అధికారులు